
సప్తనారీ హంస వాహనంపై ఊరేగుతున్న కుక్కుటేశ్వరస్వామి. ప్రత్యేక అలంకరణలో రాజరాజేశ్వరీదేవి అమ్మవారు


పాదగయ పుష్కరిణిలో పుణ్య స్నానాలకు పోటెత్తిన భక్తులు


పాదగయలో స్వామివారి దర్శనానికి క్యూ కట్టిన భక్తులు


పంచారామ క్షేత్రంలో ప్రధాన ద్వారం వద్ద భక్తులను అదుపు చేస్తున్న ట్రైనీ డీఎస్పీ ఈశ్వర్ యస్వంత్


భక్తులకు పాలు పంపిణీ చేసిన మాజీ ఎంపీపీ కొండపల్లి కృష్ణమూర్తి


వాసవీ యూత్ అండ్ ఫ్రెండ్స్ ఆధ్వర్యంలో అన్నదానం

పాదగయ.. జన సంద్రం


భక్తజనసంద్రంగా మారిన పాదగయ క్షేత్రం

- వైభవంగా మహాశివరాత్రి వేడుకలు
- లక్షలాదిగా తరలివచ్చిన భక్తులు
- మార్మోగిన శివనామస్మరణ

పిఠాపురం: మహాశివరాత్రిని పురస్కరించుకుని శుక్రవారం పిఠాపురంలోని పాదగయ క్షేత్రం జనసంద్రమైంది. గయాసురిని పాదాలున్న పాదగయ క్షేత్రంలో మహాశివరాత్రి పర్వదినాన పుణ్యస్నానమాచరిస్తే సకలపాపాలు తొలగిపోతాయని భక్తుల నమ్మకం. ఈ మేరకు తెల్లవారుజాము నుంచి వేలాదిగా భక్తులు తరలిరావడంతో పాదగయ పుష్కరిణి భక్తజనగయగా మారిపోయింది. హరహర మహాదేవ.. శంభోశంకర అంటూ భక్తులు చేసిన శివనామస్మరణతో పిఠాపురం మార్మోగింది. పాదగయ పుష్కరిణిలో పుణ్యస్నానాలు ఆచరించేందుకు సుమారు లక్షలాది మంది భక్తులు తరలిరాగా పిఠాపురం పట్టణం భక్తులతో నిండిపోయింది. పుణ్యస్నానాలు ఆచరించిన భక్తులు ఆలయంలోని కుక్కుటేశ్వర స్వామి, రాజరాజేశ్వరీదేవి, పురుహూతికా అమ్మవార్లు, దత్తాత్రేయస్వామి, సాయిబాబాలను దర్శించుకుని పూజలు చేశారు. కొంత మంది భక్తులు గంగమ్మతల్లికి దీపారాధన, ప్రత్యేక పూజలు నిర్వహించారు. క్యూలైన్లలో భక్తులు తెల్లవారుజాము నుంచి రాత్రి వరకూ బారులు తీరి స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. ఆలయ పరిసర ప్రాంతాలు భక్తులతో కిక్కిరిసిపోయాయి.

ఒంటి గంట నుంచే పూజలు

మహా శివరాత్రిని పురస్కరించుకుని గురువారం రాత్రికే భక్తులు పాదగయకు చేరుకున్నారు. శుక్రవారం తెల్లవారుజామున ఒంటి గంట నుంచి స్వామివారికి అభిషేకం, అమ్మవారికి కుంకుమార్చనలు నిర్వహించారు. తెల్లవారుజామున 2 గంటల నుంచి కుక్కుటేశ్వరస్వామి భక్తులకు నిజరూపంలో దర్శనమిచ్చారు. రాత్రి స్వామికి లింగోద్భవ కాలాభిషేకం నిర్వహించారు. ఎమ్మెల్యే పెండెం దొరబాబు, కాకినాడ ఎంపీ, వైఎస్సార్ సీపీ పిఠాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి వంగా గీత, పలువురు న్యాయమూర్తులు, ప్రజాప్రతినిధులు, అధికారులు స్వామి వారిని దర్శించుకున్నారు. భక్తులు వివిధ వాహనాలపై పాదగయకు తరలిరావడంతో 216వ నంబర్ జాతీయ రహదారితో పాటు ఉప్పాడ–సామర్లకోట రోడ్లపై ట్రాఫిక్ నిలిచిపోయింది. స్వచ్ఛంద సేవా సంస్థల ఆధ్వర్యంలో భక్తులకు మంచినీరు, మజ్జిగ, భోజనాలు ఏర్పాటు చేశారు. పట్టణంలోని సోమేశ్వర స్వామి, సకలేశ్వరస్వామి దేవాలయాలు భక్తులతో కిటకిటలాడాయి.

కొత్తపల్లి: మహాశివరాత్రి వేడుకలు మండల వ్యాప్తంగా శుక్రవారం ఘనంగా జరిగాయి. తెల్లవారుజాము నుంచి ఆలయాలకు భక్తులు పోటెత్తారు. కొత్తపల్లి ఊర చెరువు సెంటర్ వద్ద వేంచేసిన బాలాత్రిపురసుందరీ సమేత రాజశేఖరస్వామి, ఉప్పాడలోని మత్స్యలింగేశ్వరస్వామి, చౌడేశ్వరీ సమేత రామలింగేశ్వరస్వామి, మూలపేట, యండపల్లి, గోర్స, కొమరగిరి, నాగులాపల్లి గ్రామాల్లోని ఉమారామలింగేశ్వరస్వామి ఆలయాల్లో స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. పలు ఆలయాల వద్ద మధ్యాహ్నం అన్నదానం చేశారు. పలు ఆలయాల్లో మహిళలు లలితా, విష్ణు సహస్రనామ పారాయణలు చేశారు.

నేడు రథోత్సవం

పాదగయక్షేత్రంలో స్వామివారి రథోత్సవం శనివారం రాత్రికి నిర్వహించడానికి అధికారులు ఏర్పాట్లు చేశారు. రెండో రోజు కూడా భక్తులు వచ్చే అవకాశం ఉండడంతో ఓ పక్క పుణ్యస్నానాలతో పాటు మరోపక్క రథత్సవానికి ఏర్పాట్లు పూర్తి చేశారు.


ఉప్పాడలో రామలింగేశ్వరస్వామికి పూజలు


కొత్తపల్లిలో రాజశేఖరస్వామిని దర్శించుకుంటున్న భక్తులు


ప్రత్యేక అలంకరణలో పంచారామ క్షేత్రంలోని స్వామి, బంగారు కిరీటంతో బాలాత్రిపుర సుందరి అమ్మవారు

భక్తవశంకర సేవలో..

- పంచారామ క్షేత్రంలో పోటాపోటీగా సేవా కార్యక్రమాలు
- భక్తులకు పాలు, మజ్జిగ, అల్పాహారం, భోజనాల ఏర్పాటు
- స్వామి వారిని దర్శించుకున్న లక్షమంది భక్తులు


సామర్లకోట పంచారామ క్షేత్ర పుష్కరణిలో స్నానాలు చేస్తున్న భక్తులు

సామర్లకోట: స్థానిక పంచారామ క్షేత్రం బాలత్రిపుర సుందరి సమేత కుమారారామ భీమేశ్వర ఆలయం వద్ద భక్తుల సేవలలో వివిధ స్వచ్ఛంద సంస్థలు తరించాయి. తెల్లవారుజాము నుంచి వచ్చిన భక్తులకు లయన్స్ క్లబ్, ఉప్పువారి సత్రం, కొండపల్లి కృష్ణమూర్తి బ్రదర్స్, పాలు, రొట్టెలు, మజ్జిగ, పులిహోర, అల్పాహారం, తాగునీరు అందజేశారు. లయన్స్ క్లబ్ ప్రతినిధులు ఈదల ఈశ్వరకుమార్, చిత్తూలూరి వీర్రాజు, ఉప్పువారి సత్రం ప్రతినిధులు ఉప్పు సత్యనారాయణ, కొదండరామయ్య, కొండపల్లి కృష్ణమూర్తిలు సేవలు అందించారు. వాసవీ యూత్ అండ్ ఫ్రెండ్స్ ఆధ్వర్యంలో సుమారు 25 వేల మందికి, కర్రి వెంకట్రాజు పేరున 30 వేల మందికి, కుమారస్వామి అన్నదాన ట్రస్టు పేరున 15 వేల మందికి అన్నదానం చేశారు. వేట్లపాలెం పీహెచ్‌సీ, అచ్చంపేట ఆయుర్వేద ఆస్పత్రి ఆధ్వర్యంలో ఆరోగ్య శిబిరం ఏర్పాటు చేశారు. డీఎస్పీ కె.లతాకుమారి పర్యవేక్షణలో ట్రైనింగ్ డీఎస్పీ ఈశ్వర్ యశ్వంత్, సీఐ డి.సురేష్‌ల ఆధ్వర్యంలో భారీ ఎత్తున పోలీసు బందోబస్తు ఏర్పాట్లు చేశారు. పట్టణ పరిధిలో అన్నపూర్ణ సమేత రామలింగేశ్వరస్వామి, చౌడేశ్వరీ సమేత రామలింగేశ్వరస్వామి ఆలయంలోను, చంద్రశేఖరస్వామి ఆలయంలోను భక్తులు స్వామి వారిని అమ్మవార్లను దర్శించుకున్నారు.

క్యూలైన్లలో బారులు తీరిన భక్తులు

మహాశివ రాత్రి సందర్భంగా ఆలయ ఉత్సవాల అధికారి అల్లు వెంకటదుర్గాభవాని, ఈఓ బళ్ల నీలకంఠం, దవులూరి చారిటబుల్ ట్రస్టు అధినేత దవులూరి సుబ్బారావు, ఉత్సవ కమిటీ సభ్యులు యండమూరి వెంకట సుబ్బారావు, కర్రి వెంకటలక్ష్మి, బొందలపు వెంకటరమణ, నాతిపాముల సూరిబాబు, చల్లా కుమారి, కౌన్సిలర్లు భక్తులకు సేవలందించారు. వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ కోఆర్డినేటర్ దవులూరి దొరబాబు, ఎమ్మెల్యే ఎస్.రాజప్ప, దేవాదాయ శాఖ డీసీ ఎం.విజయరాజు దంపతులు, జెడ్పీ సీఈఓ రామచంద్రమూర్తి, ఆర్డీఓలు సీతారామారావు, కిశోర్, తహసీల్దార్ వై.శ్రీనివాసు, వివిధ శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు అధిక సంఖ్యలో భక్తులు స్వామిని దర్శించుకున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు సుమారు లక్ష మంది భక్తులు స్వామిని దర్శించుకున్నట్లు అధికారులు అంచనా వేశారు. తెల్లవారుజామున స్వామి వారికి అభిషేకాలు అనంతరం స్వామి, అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించారు.

పెద్దాపురంలో..

పెద్దాపురం: స్థానిక శివాలయంలో భారీ అన్న సమారాధన నిర్వహించారు. ఆలయ ఈఓ కాట్నం జగన్మోహన శ్రీనివాస్ ఆధ్వర్యంలో ప్రసాద వితరణ చేశారు. భజన సంఘాలు శివనామ స్మరణ సంకీర్తనలు ఆలపించారు. సత్తిరెడ్డిపేటలో భగవద్గీత ప్రచార సమితి వ్యవస్థాపకుడు మల్లిఖార్జున స్వామి ఆధ్వర్యంలో గీతా పారాయణ నిర్వహించారు. నిర్వాహకుడు సత్య కుమార్, నేతి వీరభద్రరావు ప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో దర్భా వెంకటేశ్వరశర్మ, పెచ్చెట్టి నూకామణి, విజయ, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.


గీతా పారాయణ చేస్తున్న మల్లికార్జున స్వామి

అన్నవరం నుంచి భీమేశ్వరునికి పట్టు వస్త్రాలు

సామర్లకోట: స్థానిక పంచారామ క్షేత్రంలోని స్వామి, అమ్మవార్లకు అన్నవరం దేవస్థానం నుంచి పట్టు వస్త్రాలు తీసుకువచ్చారు. మహాశివరాత్రిని పురస్కరించుకుని శుక్రవారం అన్నవరం ట్రస్టు బోర్డు సభ్యులు నేతల వెంకటలక్ష్మి, స్వామినాయుడు వాటిని తీసుకువచ్చారు. వీటిని దవులూరి చారిటబుల్ ట్రస్టు అధినేత దవులూరి సుబ్బారావు స్వీకరించి ఆలయ వేదపండితులకు అందజేశారు. శుక్రవారం అర్ధరాత్రి లింగోద్భవ కాల పూజ కోసం వీటిని అందజేశారు. పంచారామ క్షేత్రాన్ని అన్నవరం దేవస్థానం దత్తత తీసుకోవడంతో ఈ పట్టు వస్త్రాలను సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఈఓ బళ్ల నీలకంఠం, కౌన్సిలర్లు నేతల హరిబాబు, సేపెని సురేష్, ఉత్సవ కమిటీ సభ్యులు చల్లా సత్తిబాబు, బీవీ రమణలు పాల్గొన్నారు.


పట్టువస్త్రాలు తీసుకువస్తున్న నేతల వెంకటలక్ష్మి, దవులూరి సుబ్బారావు

క్లుప్తంగా

రథోత్సవానికి రంగం సిద్ధం


ఊరేగింపునకు సిద్ధమవుతున్న రథం

సామర్లకోట: స్థానిక పంచారామ క్షేత్రంలో బాలత్రిపుర సుందరి, కుమారారామ భీమేశ్వరస్వామి కల్యాణ ఉత్సవాలల్లో భాగంగా శనివారం రథోత్సవం నిర్వహించనున్నారు. ఈ మేరకు రథాన్ని పూలు, విద్యుద్దీపాలతో అలంకరించారు. మధ్యాహ్నం బ్యాండ్ మేళాలు, బాణసంచా కాల్పులు, వివిధ సాంస్కృతిక ప్రదర్శనల మధ్య రథం గాంధీ చౌక్ సెంటర్ నుంచి మళ్లీ అక్కడి వరకు సాగనుంది. ఈ సందర్భంగా పలు సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించనున్నట్టు రథోత్సవ కమిటీ తెలిపింది.

కొనసాగుతున్న మత్స్యకారుల ఆందోళన


కోనపాపపేట బీచ్ రోడ్డులో బోటు దహనం చేసి నిరసన తెలుపుతున్న మత్స్యకారులు

కొత్తపల్లి: తీరప్రాంతంలో కాలుష్య పరిశ్రమల నిర్మాణం, కలుషిత జలాలను పైప్‌లైన్ల ద్వారా సముద్రంలోకి విడుదల చేయడం వలన భవిషత్‌తో మత్స్యకారుల జీవనోపాధికి ముప్పు ఏర్పడుతుందని మత్స్యకార సంఘం నాయకులు అన్నారు. తీరంలో పరిశ్రమల నిర్మాణానికి వ్యతిరేకంగా మండలంలోని పొన్నాడ శివారు కోనపాపపేటలో మత్స్యకారుల చేస్తున్న ఆందోళన రెండోరోజు శుక్రవారం కొనసాగింది. బీచ్ రోడ్డులో మత్స్యకారులు బోటును దహనం చేసి నిరసన తెలిపారు. పరిశ్రమ నుంచి వచ్చే వ్యర్థాలను పైపులైన్ల ద్వారా సముద్రంలోకి విడుదల చేయడం వలన మత్స్య సంపద అంతరించిపోతుందన్నారు. తీరప్రాంతంలో మత్స్యకారులు అనారోగ్యం బారిన పడే అవకాశం ఉందని భయాందోళనలు వ్యక్తం చేశారు. తీరంలో కాలుష్య పరిశ్రమల నిర్మాణాలను నిలిపి వేసే వరకూ ఆందోళన కొనసాగిస్తామని తెలిపారు.

సంపద తయారీ కేంద్రాల తనిఖీ

పెద్దాపురం: మండలంలోని సంపద తయారీ కేంద్రాల వద్ద అసాంఘిక చర్యలకు పాల్పడే వ్యక్తులపై చర్యలు తప్పవని ఎస్‌డబ్ల్యూపీసీ రిసోర్స్ పర్సన్ జి.రాజ్‌కుమార్ అన్నారు. మండలంలోని వడ్లమూరు, గోరింట, దివిలి, చంద్రమాంపల్లి, తాటిపర్తి గ్రామ పంచాయతీల్లోని సంపద తయారీ కేంద్రాల నిర్వహణపై శుక్రవారం ఆయన మండల విస్తరణాధికారి కె.రాజశేఖర్‌తో కలసి తనిఖీలు చేశారు. ఆయా కేంద్రాల వద్ద డంపింగ్ నిర్వహణ సక్రమంగా లేకపోవడంతో పంచాయతీ సిబ్బందిపై అసంతృప్తి వ్యక్తం చేశారు. చెత్త రోడ్లపై లేకుండా చూడాలని సిబ్బందిని ఆదేశించారు. షెడ్ నిర్మాణాలకు అవసరమైన నిధుల కోసం తన వంతు కృషి చేస్తానని ఈఓపీఆర్డీ రాజశేఖర్ తెలిపారు. వారి వెంట ఎఫ్‌టీసీ టీఏ గణేష్, పంచాయతీ, సచివాలయ కార్యదర్శులు ఉన్నారు.


ఇంటింటికీ లేఖల పంపిణీ

కొత్తపల్లి: వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారం చేపట్టాక ప్రజలకు వివిధ పథకాల రూపంలో చేకూరిన లబ్ధిని వలంటీర్లు వివరిస్తున్నారు. మండలంలోని కొండెవరంలో శుక్రవారం వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సందేశాలతో కూడిన లేఖలను ప్రజలకు పంపిణీ చేశారు. సంక్షేమ పథకాల రూపంలో పొందిన లబ్ధిని వివరించారు. మూడు రోజుల పాటు ఈ కార్యక్రమం నిర్వహించనున్నట్లు వలంటీర్లు తెలిపారు.


కొండెవరంలో అవ్వకు సీఎం సందేశం కూడిన లేఖను అందిస్తున్న వలంటీర్ రాజేష్

మరిడమ్మకు బంగారు పుష్పాలతో పూజ

పెద్దాపురం: స్థానిక మరిడమ్మ అమ్మ వారికి శుక్రవారం 108 బంగారు పుష్పాలతో అష్టోత్తర నామార్చన చేశారు. ఆలయ ట్రస్టీ చింతపల్లి బ్రహ్మాజీ, ఆలయ అసిస్టెంట్ కమిషనర్ సీహెచ్ రామ్మోహనరావుల ఆధ్వర్యంలో వేదపండితులు చిట్టెం హరి గోపాలశర్మ పర్యవేక్షణలో ఘనంగా నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.


బంగారు పుష్పాలతో అమ్మవారు

11న కౌన్సిల్ అత్యవసర సమావేశం

సామర్లకోట: మున్సిపల్ కౌన్సిల్ అత్యవసర సమావేశం ఈనెల 11వ తేదీ ఉదయం 11 గంటలకు చైర్‌పర్సన్ గంగిరెడ్డి అరుణ అధ్యక్షతన జరుగుతుందని మున్సిపల్ కమిషనర్ జె.రామారావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణ అభివృద్ధికి చెందిన అంశాలు గత కౌన్సిల్ సాధారణ సమావేశంలో వాయిదా పడడంతో ఆ అంశాలపై చర్చించడానికి అత్యవసర సమావేశం ఏర్పాటు చేశామన్నారు. ఈ సమావేశానికి అధికార, ప్రతిపక్ష సభ్యులు, ఆయా శాఖల అధికారులు హాజరు కావాలన్నారు.

జోరుగా అపరాల పంట ఒబ్బిడి

తొండంగి: మండల వ్యాప్తంగా అపరాల పంట ఒబ్బిడి పనులు జోరుగా సాగుతున్నాయి. ఈ ఏడాది మండలంలో 1270 హెక్టార్లలో పెసర, 470 హెక్టార్లలో మినుము పంటలను రైతులు సాగు చేశారు. పంట కాలం పూర్తికావడంతో అన్నదాతలు పంటను ఒబ్బిడి చేస్తున్నారు. కూలీలకు చేతినిండా పని దొరుకుతోంది. మరో వారం రోజుల్లో అపరాల ఒబ్బిడి పనులు పూర్తవుతాయని మండల వ్యవసాయశాఖాధికారి ఎస్. నరసింహం తెలిపారు.


గోపాలపట్నంలో అపరాల పంటను ఒబ్బిడి చేస్తున్న కూలీలు

మహిళలకు అండగా ప్రభుత్వం


పిఠాపురంలో ఎంపీ వంగా గీతను సత్కరిస్తున్న మహిళా ప్రజాప్రతినిధులు


మహిళా ఉద్యోగులను సత్కరిస్తున్న స్టేషన్ మేనేజర్ రమేష్ తదితరులు

- కాకినాడ ఎంపీ వంగా గీత
- పిఠాపురంలో ఘనంగా మహిళా దినోత్సవం

పిఠాపురం: మహిళలకు ప్రభుత్వం అండగా నిలుస్తోందని కాకినాడ ఎంపీ, వైఎస్సార్ సీపీ పిఠాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి వంగా గీత అన్నారు. పిఠాపురంలో శుక్రవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. ఎంపీ వంగా గీత ముఖ్య అతిథిగా పాల్గొని కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం అన్ని రంగాల్లోనూ మహిళలకు సముచిత స్థానం కల్పించడంతో పాటు మహిళల రక్షణకు దిశా చట్టం తీసుకువచ్చి పగడ్బందీగా అమలు చేస్తోందన్నారు. మహిళలు అన్ని రంగాల్లోనూ ముందంజలో ఉండేలా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారన్నారు. అనంతరం వైఎస్సార్ సీపీ జిల్లా మహిళా అధ్యక్షురాలు వర్ధినీడి సుజాత, పిఠాపురం మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్లు పచ్చిమళ్ల జ్యోతి, కొత్తపల్లి పద్మ, పలువురు మహిళా కౌన్సిలర్లు, మహిళలు ఎంపీ గీతను పూలమాల, శాలువాతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పలువురు మహిళా ప్రతినిధులు పాల్గొన్నారు.

మహిళా సాధికారతతోనే దేశాభివృద్ధి

పెద్దాపురం: మండలంలో శుక్రవారం మహిళా దినోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఉలిమేశ్వరం, కాండ్రకోటల్లో నిర్వహించిన ఉత్సవాల్లో ఎంపీడీఓ జి.ఉషారాణి పాల్గొని మహిళా సాధికారితతోనే దేశాభివృద్ధి సాధ్యమన్నారు. జెడ్పీటీసీ గవరసాని సూరిబాబు, మండల విస్తరణాధికారి కె.రాజశేఖర్ మాట్లాడుతూ చట్టాలపై మహిళలకు అవగాహన అవసరమన్నారు. ఈ సందర్భంగా మహిళా ప్రజాప్రతినిధులు, వయోవృద్ధులను సత్కరించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు మాకిరెడ్డి శ్రీనివాస్, కనపర్తి చీమదొర, కురిమెళ్ల లోవరాజు, గోపు మురళి, ఒబిలిశెట్టి అబ్బాయి తదితరులు పాల్గొన్నారు. శాంతివర్ధన విభిన్న ప్రతిభావంతుల పాఠశాలలో ప్రిన్సిపాల్ రాయవరపు సత్య, పాఠశాల వ్యవస్థాపకుడు వీరబాబు, ప్రిన్సిపాల్ ఆర్.సత్యవేణి తదితరుల ఆధ్వర్యంలో మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. అలాగే వైజ్ సంస్థలో అధ్యక్షురాలు బి.మల్లేశ్వరి అధ్యక్షతన జరిగిన ఎస్ఐ వెలుగుల సురేష్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ మహిళల హక్కుల పోరాటంలో సావిత్రి భాయి పూలేను ఆదర్శంగా తీసుకుని పోరాడాలన్నారు. అనంతరం పీఎల్‌హెచ్‌వి బాధితులకు పౌష్టికాహార కిట్లను అందజేశారు. ఐసీటీసీ కౌన్సిలర్ శ్రీనివాసరావు, బార్ అసోషియేషన్ అధ్యక్షులు వేదుల మణి తదితరులు పాల్గొన్నారు. స్థానిక శాఖా గ్రంధాలయంలో లైబ్రేరియన్ పాలంకి నాగరాజు అధ్యక్షతన జిల్లా గ్రంధాలయ శాఖాధికారి ఎం.శేఖర్‌బాబు, సాహితి స్రవంతి జిల్లా అధ్యక్షులు జోస్యుల కష్టబాబు మహిళలనుద్దేశించి మాట్లాడారు. అలాగే యాసలపు సూర్యారావు భవనంలో ఐద్వా అధ్యక్షురాలు కూనిరెడ్డి అరుణ అధ్యక్షతన సీఐటీయూ జిల్లా నాయకురాలు వీరలక్ష్మి తదితరులు మాట్లాడుతూ మహిళా రిజర్వేషన్‌ను 50 శాతం సాధించేందుకు కృషి చేయాలన్నారు. అలాగే ఏపీ రైతుకూలీ సంఘం, ప్రగతి శీల మహిళా సంఘం ఆధ్వర్యంలో పులిమేరులో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాకుల వీరాంజనేయులు మాట్లాడుతూ మహిళా హక్కులపై ఉద్యమించాలన్నారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు.


మహిళా దినోత్సవ సభలో ప్రసంగిస్తున్న ఎంపీడీఓ ఉషారాణి

రాక్ సిరామిక్స్‌లో..

సామర్లకోట: మహిళలు ఆరోగ్యంగా ఉంటేనే ఆ కుటుంబం ఆరోగ్యంగా ఉంటుందని రాక్ సిరామిక్స్ వైస్ ప్రెసిడెంట్ కల్లోల్ కుమార్ ఘెష్ అన్నారు. శుక్రవారం రాక్ సిరామిక్స్‌లో మహిళా దినోత్సవాన్ని నిర్వహించి మహిళా ఉద్యోగులను సత్కరించారు. మెడికవర్ ఆస్పత్రి డాక్టరు నవీన్ ఆరోగ్య చిట్కాలు, వడ దెబ్బ, సీపీఆర్ విధానాన్ని వివరించారు. హెచ్ఆర్ అండ్ అడ్మిన్ విభాగాధిపతి టి.సీరజ్‌కుమార్, సేఫ్టీ మేనేజరు బాలాజీ, పబ్లిక్ రిలేషన్ మేనేజరు వీజీఎస్ కుమార్, మహిళా ఉద్యోగులు, కార్మికులు పాల్గొన్నారు.


రాక్ సిరామిక్స్‌లో మాట్లాడుతున్న కల్లోల్ కుమార్ ఘెష్

మహిళలను అంతా గౌరవించాలి

సామర్లకోట: మహిళలు గౌరవించాల్సిన బాధ్యత అందరిపై ఉన్నదని స్థానిక రైల్వే స్టేషన్ మేనేజరు ఎం.రమేష్ అన్నారు. మహిళా దినోత్సవం సందర్భంగా శుక్రవారం సాయంత్రం స్థానిక రైల్వే స్టేషన్‌లో వివిధ విభాగాలకు చెందిన మహిళా ఉద్యోగులను సత్కరించారు. పురుషులతో సమానంగా అన్ని రంగాలల్లో మహిళలు ముందుకు దూసుకుపోతున్నారని అభినందించారు. చీఫ్ కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ ఏవీకె సంతోష్ కుమార్, రైల్వే ఎస్సై బి.లోవరాజు, ఆర్పీఎఫ్ ఎస్సై ఎన్.రామకృష్ణ, రైల్వే సూపరింటెండెంట్ అనంతలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నెట్‌బాల్ టోర్నీలో విద్యార్థి ప్రతిభ


విద్యార్థి రవికుమార్‌ను అభినందిస్తున్న ఆదిత్య కళాశాల సిబ్బంది

గండేపల్లి: సూరంపాలెం ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాలకు చెందిన విద్యార్థి ఎస్. రవికుమార్ నెట్ బాల్ టోర్నమెంట్‌లో ప్రతిభ కనబరిచి ఆలిండియా ఇంటర్ యూనివర్సిటీ పోటీలకు ఎంపికైనట్టు ప్రిన్సిపాల్ డోలా సంజయ్ తెలిపారు. కంప్యూటర్ సైన్స్ తృతీయ సంవత్సరం చదువుతున్న రవికుమార్ ఏలూరు సీఆర్ రెడ్డి కాలేజీలో ఇటీవల నిర్వహించిన జేఎన్టీయూకే సెంట్రల్ జోన్ నెట్ బాల్ టోర్నమెంట్‌లో పాల్గొన్నాడు. విశేష ప్రతిభ కనబరిచి ఈ నెల 12 నుంచి 15 వరకూ కర్ణాటకలో జరిగే హైయర్ యూనివర్సిటీ పోటీల్లో పాల్గొనేందుకు అర్హత సాధించినట్టు చెప్పారు. ఈ సందర్భంగా రవికుమార్‌ను కళాశాల సిబ్బంది, అధ్యాపకులు అభినందించారు.

రేపు తోలుబొమ్మలాటలో శిక్షణ

బోట్‌క్లబ్: తోలుబొమ్మలాట కళాకారులకు ఈ నెల 10న స్థానిక ఎన్ఎఫ్‌సీఎల్‌రోడ్డులోని సత్కళావాహినిలోని శిక్షణ ఇవ్వనున్నట్టు ఆ సంస్థ నిర్వాహకులు ఈవీ కృష్ణమాచార్యులు శుక్రవారం తెలిపారు. కేంద్ర ప్రభుత్వ సంగీత నాటక అకాడమీ ఆధ్వర్యంలో ఈ శిక్షణ ఇస్తున్నట్టు తెలిపారు. ఆ రోజు ఉదయం 10 గంటలకు రూరల్ ఎమ్మెల్యే కురసాల కన్నబాబు, కేంద్ర ప్రభుత్వ సంగీత నాటక అకాడమీ సభ్యురాలు ఎస్పీ భారతి ఈ శిక్షణను ప్రారంభిస్తారన్నారు.